www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక
తెలంగాణ దిక్సూచి
ఆదివారం | 08 | నవంబర్ | 2026 | పేజీలు: 08

రంగులేసి పాత సరుకు బిగించి


కొత్త తీగలు పాత ట్రాన్స్‌ఫార్మర్

కొత్త పనుల్లో పాత సరుకు

ట్రాన్స్‌ఫార్మర్ పనుల్లో కాంట్రాక్టర్ మోసం

పాత వివరాలున్నా పట్టించుకోని ఆఫీసర్లు

విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్



నర్సంపేట, అక్షిత ప్రతినిధి : పల్లెల్లో విద్యుత్ పనులు చేసే కొందరు కాంట్రాక్టర్లు రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టాల్సిన చోట, పాత వాటికే పైపైన రంగులేసి పెడుతూ ప్రభుత్వ సొమ్మును జేబుల్లో వేసుకుంటున్నారు. కరెంటు ఆఫీసర్లు పనులు సరిగ్గా జరుగుతున్నాయో లేదో చూడకపోవడంతో కాంట్రాక్టర్లు ఆడిందే ఆటగా మారింది. నెక్కొండ మండలం పనికర గ్రామ సమీపంలో జరిగిన ఘటనే దీనికి నిదర్శనం. పనికర గ్రామ సమీపంలోని రైతు బండారు అశోక్ పొలం దగ్గర కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పెట్టేందుకు కాంట్రాక్టర్ పనులు చేపట్టాడు. కరెంటు స్తంభాలు, తీగలు కొత్తవి వేశాడు. కానీ అసలైన ట్రాన్స్‌ఫార్మర్‌ను మాత్రం పాతదే తీసుకొచ్చి బిగించాడు. పూర్తిగా తుప్పు పట్టిన ఆ పాత ట్రాన్స్‌ఫార్మర్ మీద పాత నంబర్లు, ఇతర వివరాలు స్పష్టంగా రాసి కనిపిస్తున్నాయి. దీన్ని చూస్తే అది పాత సరుకేనని సామాన్య రైతులకు కూడా ఇట్టే అర్థమవుతోంది. నిజానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌కు కంపెనీ నుంచి గ్యారంటీ ఉంటుంది. కానీ ఇలాంటి తుప్పు పట్టిన పాతది పెడితే, రేపు పొద్దున అది కాలిపోతే ఎవరిది ..మిగతా 2లో



పట్టుపట్టి... పంతం నెగ్గించి

సంక్షేమానికి పెద్దపీట.. అభివృద్ధిలో రాజీలేదు

విద్యకు రూ.200 కోట్లు

అంతర్జాతీయ ప్రమాణాల పాఠశాలలు

సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు నో

ఎమ్మెల్యే శంకర్ పట్టుదలకు ప్రశంసలు

అభివృద్ధి పనులకు నిధుల సాధన

మంత్రి పొంగులేటి

2

పార్కులకు కొత్త కళ నగరానికి కొత్త శోభ



పచ్చదనానికి పెద్దపీట పార్కులకు కొత్త హంగులు

పార్కులే ఇక వర్క్ స్పేస్‌లు

పచ్చదనం ప్రజలకు ఆహ్లాదం!

సీఎంసీ కమిషనర్ జి.సృజన

శేరిలింగంపల్లి, అక్షిత ప్రతినిధి : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పార్కులను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ జి. సృజన తెలిపారు. శనివారం రోజు సీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ విలేఖరులతో మాట్లాడుతూ సీఎంసీ పరిధిలో మొత్తం 770 ఖాళీ స్థలాలు ఉన్నాయని, అవి కబ్జా కాకుండా 300 స్థలాలకు ప్రహరీ గోడలు నిర్మించామని, ఇంకా ..మిగతా 2లో

అర్హులందరికీ ఓటు హక్కు

21 వరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించండి

సర్-2026 ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లతో

వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి



సూర్యాపేట, అక్షిత బ్యూరో : అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల సంఘం లక్ష్యమని, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ -2026 ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సర్- 2026 ప్రక్రియ, ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ, ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయడం, గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన, ద్వంద (ఏఎస్ డిడి) ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, ..మిగతా 2లో

రంగులేసి పాత సరుకు బిగించి

మొదటి పేజీ తరువాయి...

బాధ్యత అని రైతులు ప్రశ్నిస్తున్నారు. పాత ట్రాన్స్‌ఫార్మర్ పెట్టి, కొత్తది పెట్టినట్లు అధికారులకు బిల్లులు పెట్టుకుని డబ్బులు మింగేయాలనే ఉద్దేశంతోనే కాంట్రాక్టర్ ఇలా మోసానికి తెరతీశాడని రైతులు మండిపడుతున్నారు. కళ్ల ముందే ఇంత జరుగుతున్నా స్థానిక కరెంటు ఆఫీసర్లు పట్టించుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ వ్యవహారంపై విద్యుత్ శాఖ పై అధికారులు వెంటనే స్పందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. నేరుగా వచ్చి విచారణ జరిపి, పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించిన కాంట్రాక్టర్‌పై కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు. అలాగే పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కరెంటు ఆఫీసర్లపై కూడా చర్యలు తీసుకోవాలని పట్టుబడుతున్నారు. ఆధారాలతో సహా దొరికిన ఈ మోసంపై అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

అర్హులందరికీ ఓటు హక్కు



మొదటి పేజీ తరువాయి...

డబుల్ ఓటర్ల వివరాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్ష నిర్వహించారు.జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా మరో ఏడు రాష్ట్రాల్లో సర్-2026 ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించిందని తెలిపారు.ఈ అవకాశంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు మరోసారి తమ ఫారాలను సమర్పించేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు.గైర్హాజరు, చిరునామా మార్పు, మరణం, డబుల్ తదితర కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఆబ్సెంట్,షిఫ్టెడ్, డెత్,డబుల్ జాబితాలో తమ పేర్లు ఉండి ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని అర్హులైన వారు నవంబర్ 21 వరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించవచ్చని తెలిపారు. అర్హులైన వ్యక్తులు తమ వివరాలను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించి ఓటరు జాబితాలో పేరు చేర్చుకోవాలని సూచించారు. ఇప్పటికే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు)ఇంటింటి విచారణ చేపట్టి, అర్హులైన ఓటర్లను గుర్తించి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయాలని సూచించారు.ఫారాలు అందని ఓటర్లను గుర్తించి, వారికి తిరిగి ఫారాలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫోన్ నంబర్లు,ఈ-మెయిల్ ఐడీలు అనుసంధానమై ఉన్న ఓటర్లకు వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా కూడా ఫారాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.ఈ వివరాలను ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉంచడంతో పాటు,ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో కూడా పోలింగ్ కేంద్రాల వారీగా అందుబాటులో ఉంచాలని సూచించారు.జాబితాల్లోని వివరాలను పారదర్శకంగా ప్రజలకు తెలియ జేయాలని, అర్హులైన ఓటర్లు తమ పేర్లను తిరిగి నమోదు చేసుకునేందుకు అవసరమైన సమాచారం అందించాలని తెలిపారు.ఓటర్లు తమ పాత ఎపిక్ నంబర్ ఆధారంగా ఎన్నికల సంఘం వెబ్‌సైట్,ఈసీఐనెట్ యాప్ ద్వారా కూడా ఎన్యుమరేషన్ ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని సమర్పించ వచ్చని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. అర్హులైన ఓటర్ల పేర్లను తుది ఓటరు జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు తుది ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్,ఎలక్షన్ సిబ్బంది రాజేందర్ రెడ్డి, భరత్, రణదీర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుపట్టి... పంతం నెగ్గించి

సంక్షేమానికి పెద్దపీట.. అభివృద్ధిలో రాజీలేదు

విద్యకు రూ.200 కోట్లు

అంతర్జాతీయ ప్రమాణాల పాఠశాలలు

సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు నో

ఎమ్మెల్యే శంకర్ పట్టుదలకు ప్రశంసలు

అభివృద్ధి పనులకు నిధుల సాధన

మంత్రి పొంగులేటి





షాద్ నగర్, అక్షిత ప్రతినిధి : పేదల సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నందిగామ మండలంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సమీకృత పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ఆర్థిక సాయాన్ని మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని, రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని పేర్కొన్నారు. భూముల సమస్యల పరిష్కారానికి భూధార్ విధానం తీసుకొచ్చామని, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. బతుకమ్మ చీరల పంపిణీపై గత ప్రభుత్వానికి భిన్నంగా తమ ప్రభుత్వం నాణ్యమైన చీరలు అందించిందని, త్వరలో చిలకపచ్చ రంగు చీరలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

ఇదిలా ఉండగా, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పనితీరుపై మంత్రి ప్రశంసలు కురిపించారు. పట్టు పట్టి...నిధులు సాధించేవరకు పంతం నెగ్గించుకోవడంలో శంకర్ కృతకృత్యులయ్యారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టిన పనులు పూర్తయ్యే వరకు పట్టువదలకుండా కృషి చేస్తారని, ముఖ్యమంత్రి వద్దైనా, తన వద్దైనా నిధులు, అనుమతుల కోసం పట్టుబట్టి సాధించుకునే నాయకుడని కొనియాడారు. మరోవైపు సిద్ధాపూర్ డంపింగ్ యార్డు ప్రతిపాదనపై మంత్రి కీలక ప్రకటన చేశారు. సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయబోమని స్పష్టం చేస్తూ స్థానిక ప్రజలకు ఊరటనిచ్చారు. జేఏసీ నేతలు పినపాక ప్రభాకర్, అంబటి ప్రభాకర్, శేఖర్ రెడ్డి తదితరులు రాజకీయాలకు అతీతంగా ప్రజల ఆందోళనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సైతం ఈ అంశాన్ని ముఖ్యమంత్రి, తన దృష్టికి తీసుకువచ్చి డంపింగ్ యార్డు ఏర్పాటు నిలిపివేయాలని కోరినట్లు మంత్రి గుర్తుచేశారు. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మంత్రి ప్రకటనతో సిద్ధాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి,మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి,మాజీ జెడ్పీటీసీ శ్యామ్ సుందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల,మాజీ ఎంపీపీ లు శివ శంకర్ గౌడ్,ప్రియాంక గౌడ్,నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ,నయ్యద్ సాదిక్ తదితరులున్నారు.

పార్కులకు కొత్త కళ నగరానికి కొత్త శోభ

మొదటి పేజీ తరువాయి...

470 స్థలాలకు గోడలు కట్టాల్సి ఉందని, వాటిని పార్కులుగా మారుస్తామన్నారు. పార్కుల్లో పచ్చదనం పెంపు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల ఆట స్థలాలు, సీనియర్ సిటిజన్లకు విశ్రాంతి సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఇటీవల పార్కుల అభివృద్ధి పనులను పరిశీలించిన ఆమె, పనులను నాణ్యతతో నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

వర్క్ ఫ్రమ్ పార్క్ కార్యక్రమానికి శ్రీకారం

పార్కుల్లో వాకింగ్ టైం అయిపోయాక కాలిగా ఉంచకుండా సాఫ్ట్‌వేర్ నిపుణుల కోసం చైర్లు, బెంచీలు ఏర్పాటు చేసి వై ఫై సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఇది సక్సెస్ అయితే అన్ని డివిజన్లలో అమలు చేస్తామన్నారు.పార్కుల నిర్వహణ ఖర్చుల కోసం నామా మాత్రపు రుసుం వసూలు చేస్తామన్నారు.

అభివృద్ధి పనులు పూర్తయిన చోట బోర్డులు ఏర్పాటు చేస్తాం

పారదర్శకత కోసం పెద్దవైనా, చిన్నవైనా సరే అభివృద్ధి పనులు పూర్తయిన చోట అవి చేసిన కాంట్రాక్టర్ చేత వాటి నాణ్యత ను తెలియజేస్తూ బోర్డులు ఏర్పాటు చేస్తామని, వాటిపై పనుల విలువ, అధికారి పేరుతో పాటు ప్రజలు ఫిర్యాదు చేయడం కోసం క్యూ ఆర్ కోడ్ ను పెడతామన్నారు.

రీ సైక్లింగ్ ప్లాస్టిక్ తో బెంచీలు, కుర్చీలు ఏర్పాటు చేసి,చెత్తను కూడా రీ సైక్లింగ్ చేస్తామన్నారు. ఎల్ నినో ప్రభావాన్ని సృష్టిలో పెట్టుకొని మొక్కలకు, నిర్మాణాలకు ఇతర అవసరాలకు రీ సైక్లింగ్ వాటర్ నేఉపయోగించాలని బిల్డర్లకు హెచ్చరించాని, తాము కూడా అవే వాటర్ ను వాడుతున్నామన్నారు. పార్కులోను, బోర్లు ఉన్న చోట నీటి సంపులను నిర్మిస్తామన్నారు. ప్రతీ నిర్మాణ ప్రదేశంలో ఇంకుడు గుంతలు ఖచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చికెన్ వేస్టేజీలను సేకరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విద్యార్థుల భాగస్వామ్యం..

సీఎంసీ పట్టణ ప్రణాళికలో విద్యార్థుల భాగస్వామ్యం పట్టణ అభివృద్ధి ప్రణాళికలో విద్యార్థుల అభిప్రాయాలకు ప్రాధాన్యత కల్పించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 'చైల్డ్ ఫ్రెండ్లీ సీఎంసీ' కార్యక్రమాన్ని చేపడుతోందనీ. యునిసెఫ్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు, యువత పాఠశాలల పిల్లలతో సంప్రదింపులు జరిపి వారి సమస్యలు, అవసరాలు, సూచనలను తెలుసుకోనున్నట్లు తెలిపారు.

సీఎంసీ పరిధిలోని 76 వార్డులకు కనీసం



152 మంది రిసోర్స్ పర్సన్లను గుర్తించి, పిల్లల అభిప్రాయాలను పట్టణ ప్రణాళికలో భాగస్వామ్యం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా నవంబర్ 20 నుంచి 23 వరకు 'లిజనింగ్ టు చిల్డ్రన్' కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. పిల్లలకు అనుకూలమైన, సురక్షితమైన నగర నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

ట్రాఫిక్ రద్దీ తగ్గింపునకు ప్రత్యేక చర్యలు.....

సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి పోలీసులు, వేరే దేశాల ప్రతినిధుల సలహాలు తీసుకొని ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, జంక్షన్ ల వద్ద వన్ వే రూప్ లను నిర్మిస్తామని తెలిపారు.

కొబ్బరి బోండాలను సేకరించి వాటి తో వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేసి వాటిని ఏ విధంగా వినియోగించే విషయాన్ని ఆలోచిస్తున్నామన్నారు.

రైటింగ్ విషయంలో సీఎంసీ కి ఏ ప్లస్ గ్రేడింగ్ రావడం చాలా సంతోమని, దీన్ని ఇలాగే కొనసాగించేలా తమ సిబ్బందికి సూచిస్తామని తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెతో కంపు కొడుతున్న సిరిసిల్ల

ఎక్కడ చూసినా పేరుకుపోతున్న చెత్తాచెదారం.. దుర్వాసనతో ప్రజల అవస్థలు

సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల ధర్నా..
మూడో రోజుకు చేరిన సమ్మె





రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్మికుల సమ్మె ప్రభావంతో పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయి. సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె శనివారం మూడో రోజుకు చేరింది. కార్మికులు విధులకు దూరంగా ఉండటంతో పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, వీధులు, చెత్త సేకరణ కేంద్రాల వద్ద చెత్తాచెదారం భారీగా పేరుకుపోతోంది. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించే వారు లేకపోవడంతో పలు ప్రాంతాలు అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయి.

ముఖ్యంగా రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన చెత్త కుండీలు నిండిపోవడంతో వాటి చుట్టూ ప్లాస్టిక్ కవర్లు, కుళ్లిపోయిన ఆహార పదార్థాలు, ఇతర వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. దీంతో అటుగా వెళ్లే ప్రజలు, వాహనదారులు, స్థానిక వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసనతో పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పరిస్థితి చూస్తుంటే సిరిసిల్ల చెత్తకుప్పల నగరంగా మారుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే పేరుకుపోతున్న చెత్తతో దోమలు, ఈగలు పెరిగే ప్రమాదం ఉందని, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా స్తంభించడంతో ప్రజారోగ్యంపై ప్రభావం పడే పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిసినా, గాలి వీచినా చెత్త రోడ్లపైకి వ్యాపించి మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.



మరోవైపు మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణమే పరిష్కార మార్గం చూపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కార్మికుల సమ్మె మూడో రోజుకు చేరుకున్నప్పటికీ సమస్య పరిష్కారానికి స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంతో పట్టణ ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది.

కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి సమ్మెకు ముగింపు పలకడంతో పాటు, ప్రత్యామ్నాయ పారిశుద్ధ్య చర్యలు చేపట్టి పట్టణంలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఒకవైపు కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోవడం, మరోవైపు పట్టణ ప్రజలు దుర్వాసన, అపరిశుభ్రతతో ఇబ్బందులు పడుతుండటంతో అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం

రామాపురంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన మంత్రి జూపల్లి



నాగర్‌కర్నూల్ అక్షిత ప్రతినిధి: పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు అన్నారు.

కొల్లాపూర్ నియోజకవర్గంలోని రామాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సొంత ఇల్లు ప్రతి పేద కుటుంబానికి ఒక కల అని, ఆ కలను నిజం చేసేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన సొంత నివాసాన్ని సమకూర్చుతున్నామని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని మంత్రి కోరారు.

ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

సామాజిక, పర్యావరణ బాధ్యతతో పండుగలు నిర్వహించాలి

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక

విశ్వశాంతి విద్యాలయంలో ముందస్తు దీపావళి వేడుకలు

సత్తుపల్లి, అక్షిత న్యూస్: పండుగలనుఆనందోత్సాహాలతో జరుపుకోవడంతో పాటు సామాజిక బాధ్యత,పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతఇవ్వాలని విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు అన్నారు.

శనివారం సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయంలో ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో



నాగేశ్వరరావు మాట్లాడుతూ దీపావళి పండుగను సురక్షిత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

బాణసంచా కాల్చేటప్పుడు తప్పనిసరిగా నీళ్లు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని, చెప్పులు ధరించాలని, కాటన్ దుస్తులనే వేసుకోవాలని తెలిపారు.విద్యుత్ తీగలు లేని ఖాళీ ప్రదేశాల్లోనే బాణసంచా కాల్చాలని,పెంపుడుజంతువులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే విధంగా కాకుండా బాధ్యతాయుతంగా పండుగ జరుపుకోవాలని కోరారు.

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగ నిలుస్తుందని, ఈ పండుగ వెనుక ఉన్న పురాణ గాథలను విద్యార్థులకు వివరించారు.అనంతరం విద్యార్థులు దీపం ఆకారంలో కూర్చొని ప్రదర్శించిన ప్రత్యేక కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య ప్రతినిధి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాక..

ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, తాండ్ర విశాలారెడ్డి

తిమ్మాపూర్ వద్ద ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో స్వాగత కార్యక్రమం



షాద్ నగర్, అక్షిత ప్రతినిధి: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండలంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం షాద్‌నగర్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ముఖద్వారమైన తిమ్మాపూర్ వద్ద ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, నందిగామ మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ , నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ సాదిక్ , ఇబ్రహీం తదితరులు పాల్గొని మంత్రికి స్వాగతం పలికారు. మంత్రి పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చాయి.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన హోంగార్డుకు రూ. 40 వేల ఆర్థిక సాయం అందజేత

మానవతా దృక్పథంతో స్పందించిన సీపీ గౌస్ ఆలం

హోంగార్డు వెల్ఫేర్ ఫండ్ నుంచి చెక్కు అందజేత



కరీంనగర్ అక్షిత బ్యూరో: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై చేయి విరిగిన సైదాపూర్ పోలీస్ స్టేషన్ డ్రైవర్, హోంగార్డు ఎండీ ముజీబ్‌కు పోలీస్ శాఖ అండగా నిలిచింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మానవతా దృక్పథంతో స్పందించి, హోంగార్డు సంక్షేమ నిధి నుంచి రూ. 40,000/- (నలభై వేల రూపాయల) ఆర్థిక సాయాన్ని మంజూరు చేశారు.ఈ నెల 2వ తేదీన సైదాపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు ముగించుకుని హోంగార్డు ఎండీ ముజీబ్ తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా, మెట్టుపల్లి వద్ద ఎదురుగా అతివేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన చేయి విరిగి తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సీపీ గౌస్ ఆలం వెంటనే స్పందించి బాధితుడికి అవసరమైన వైద్య ఖర్చుల నిమిత్తం వెల్ఫేర్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం ప్రకటించారు.

కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం హోంగార్డ్ ఆర్ఐ జానీమియా ఆధ్వర్యంలో బాధితుడు ఎండీ ముజీబ్‌కు రూ. 40 వేల చెక్కును అందజేశారు. విధి నిర్వహణలో సిబ్బందికి ఎలాంటి కష్టం వచ్చినా పోలీస్ కమిషనరేట్ యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం పేర్కొన్నారు. తన కష్ట సమయంలో తక్షణమే స్పందించి ఆర్థిక భరోసా కల్పించినందుకు హోంగార్డు ఎండీ ముజీబ్ సీపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సామాన్య కుటుంబం నుంచి రాష్ట్ర స్థాయి అధికారి వరకు...

సేవా గుణమే కమాండెండెంట్ త్రినాథ్‌కు గుర్తింపు.

జన్మదినం సందర్భంగా సత్తుపల్లిలో సేవా కార్యక్రమాలు.



సత్తుపల్లి, అక్షిత న్యూస్: సత్తుపల్లి ప్రాంతంలోని నాచారం గ్రామానికి చెందిన నరుకుళ్ళ త్రినాథ్ సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించి, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యాభ్యాసం పూర్తి చేసి, తన స్వయంకృషి, పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదిగారు.

ఎస్సై గా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం తెలంగాణ స్టేట్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కమాండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

చిన్ననాటి నుంచే సేవా భావం, సహాయ గుణం కలిగిన త్రినాథ్ ఉద్యోగ బాధ్యతలతో పాటు సమాజ సేవకు కూడా ప్రాధాన్యతనిస్తున్నారు.

సత్తుపల్లి ప్రాంతంలో పలువురికి తన వంతుగా విద్య , వైద్య, ఆధ్యాత్మిక సహాయసహకారాలు అందిస్తూప్రజల ఆదరాభిమానాలను పొందుతున్నారు.

పోలీస్ శాఖలో విశేష ప్రతిభ కనబరిచినందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్‌ను కూడా అందుకున్నారు.శనివారం త్రినాథ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సత్తుపల్లి లో సేవాకార్యక్రమాలు నిర్వహించారు.విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు, బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న నిరుపేదలకు, వృద్ధులకు, ఆనందాలకు అల్పాహారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నిర్వాహకులు రవికుమార్, సలీం, పట్టణ ప్రముకులు త్రినాథ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం

వరంగల్ సీపీ



వరంగల్, అక్షిత బ్యూరో: హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన ప్రత్యేక విద్యార్థులు, కేంద్రం వ్యవస్థాపకురాలు రామలీల, ఈసీ సభ్యుడు కల్యాణ్‌తో కలిసి హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ గారు స్టాల్‌ను సందర్శించి, ప్రత్యేక విద్యార్థులు స్వయంగా తయారుచేసిన హ్యాండ్‌మేడ్ వస్తువులను కొనుగోలు చేశారు. విద్యార్థుల సృజనాత్మకత, నైపుణ్యాలను అభినందిస్తూ వారిని ప్రోత్సహించారు. ప్రత్యేక విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు.

అనంతరం ప్రత్యేక విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి, దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ, వారి ప్రతిభను ప్రోత్సహించడం ఆనందంగా ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, ఎ ఆర్ అడిషనల్ డీసీపీ సురేష్, ఆర్ఐ (అడ్మిన్) సర్జన్ రాజ్, వెల్ఫేర్ ఆర్ఐ సతీష్, ఆర్ఐ శ్రీధర్ , మల్లికాంబ మనోవికాస కేంద్రం సిబ్బంది ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పైకప్పు పెచ్చులూడి తుప్పు పట్టిన ఇనుప చువ్వలు బయటకు..

రోగుల ప్రాణాలకు భద్రత ఏదీ?

షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పరిస్థితులు చూసి ఆందోళనకు గురైన బీఎస్పీ నాయకుడు నీరటి రాజు

ఆసుపత్రి భవనానికి తక్షణ మరమ్మతులు చేపట్టాలి.. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం





షాద్ నగర్, అక్షిత ప్రతినిధి: పేద ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలోనే రోగులకు ప్రాణభయం ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయని బహుజన్ సమాజ్ పార్టీ నాయకుడు నీరటి రాజు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించగా భవనం దుస్థితి చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యానని తెలిపారు. ఆసుపత్రి వార్డుల్లో పైకప్పు పెచ్చులూడి సిమెంట్ పొరలు కూలిపోవడంతో పాటు ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయని, గోడలు సైతం దెబ్బతిని ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో రోగులు, గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు చికిత్స పొందుతున్నారని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. వైద్యం కోసం వస్తే ప్రాణాలకు భరోసా ఉండాల్సిన ఆసుపత్రిలోనే భద్రత కరువవడం బాధాకరమన్నారు. ఆసుపత్రి భవనం పరిస్థితిని అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పైకప్పు పెచ్చులు ఊడి రోగులపై పడితే బాధ్యత ఎవరు వహిస్తారని నిలదీశారు. ఆసుపత్రికి వచ్చినప్పుడు రోగులు, వారి బంధువులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకున్నానని, అక్కడి దుస్థితిని మీడియా ద్వారా ప్రజల దృష్టికి తీసుకువస్తున్నానని వెల్లడించారు. ఇటీవల ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చిన చెరుకుపల్లికి చెందిన గర్భిణి రాధ, ఆమె శిశువు మృతి చెందిన ఘటనపైనా బాధిత కుటుంబం చేసిన ఆరోపణల నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆసుపత్రి భవనానికి భద్రతా తనిఖీలు నిర్వహించాలని, ప్రమాదకరంగా ఉన్న పైకప్పులు, గోడలకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని కోరారు. రోగులకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు అవసరమైన వైద్య సిబ్బంది, పరికరాలు, మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. పేద ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఈ సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నీరటి రాజు కోరారు..



ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు

కోనేరు స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాస్ యాదవ్



నాగర్‌కర్నూల్ అక్షిత ప్రతినిధి: లింగాల మండల పరిధిలోని వల్లభాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో మానాజీపేట గ్రామ శివారులో ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శనివారం కోనేరు స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో భవన నిర్మాణ కార్మికులు కచ్చితంగా లేబర్ కార్డు కోసం చేసుకోవాలన్నారు. దీనివల్ల 110 రూపాయలు మీసేవ సెంటర్లో చాలాను కట్టి అప్లై చేస్తే ఐదు సంవత్సరాల వరకు వ్యాలిడిటీ లేబర్ కార్డు ఉంటుంది. కార్డు ఉపయోగం ఇన్సూరెన్స్ అనుకోని సమయంలో భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందితే 10 లక్షల రూపాయలు ప్రభుత్వం నుండి అందజేస్తుంది. అదేవిధంగా వివిధ రకాల ఈ శ్రమ కార్డ్ ఇన్సూరెన్సులు కార్డులకు ప్రతి ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో అర్హత కలిగిన వృద్ధులు, వితంతువులు, ఒంటరి స్త్రీ మహిళలు, మరియు గ్రామాలలో 18 సంవత్సరాలు నిండిన మహిళలు వివాహం చేసుకున్నవారు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కి అర్హులని ప్రభుత్వం చెప్తుంది. అందుకు అర్హులు దరఖాస్తు చేసుకుంటే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద లక్ష 116 లు అందజేస్తుంది. అదేవిధంగా బ్యాంకులలో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరూ 20 రూపాయలు చెల్లిస్తే రెండు లక్షల ప్రమాద బీమా లభిస్తుంది. ఇటీవల వి బి జి రామ్ జి పథకం కింద గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ గ్రామంలో పనులు చేసుకునేందుకు అవకాశం కల్పించిందని ఉన్నారు. ఎవరు కూడా వలస వెళ్లకుండా స్థానికంగా ఉండి పనులు చేసుకుని జీవనం సాగించాలని అన్నారు . మరియు పిల్లలను కూడా పాఠశాలలో చదివించాలని సూచించారు. బడి బేటా ఎవరు కూడా పిల్లలు ఉండరాదని. ప్రతి ఒక్కరు కూడా 18 సంవత్సరాలలోపు పిల్లలు పాఠశాలలో ఉండాలని కోరారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ విధంగా ప్రభుత్వం నుండి వచ్చే పథకాల పై మీరు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అదేవిధంగా చట్టాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మానాజీపేట గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి



కరీంనగర్ అక్షిత బ్యూరో: హిందూ సంప్రదాయాలలో దీపావళి పండుగకు చాలా ప్రత్యేకత ఉందని మరియు ఈ పండుగ ద్వారా ప్రతి ఒక్క ఒక్కరి ఇంట్లో ఐశ్వర్యం, ఆరోగ్యం కలుగుతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి నిర్వహించినటువంటి దీపావళి, మిస్ మ్యాచింగ్ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడారు.

అంతకుముందు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి దీపాలను వెలిగించి శ్రీ మహాలక్ష్మి మాత చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు కార్యక్రమాన్ని నిర్వహించి దీపావళి వేడుకలకు బీజం వేశారు. దీపాల వెలుగులు ప్రతి ఇంట ఆనందాన్ని ప్రతి కుటుంబంలో సంతోషాన్ని ప్రతి ఒక్కరి జీవితంలో నూతన ఆశలను నింపుతుందని అన్నారు.దీపావళి పండుగ మనకు ఐక్యత, ప్రేమా, సోదర భావం, ధర్మం, మరియు మానవతా విలువలను చాటిచెప్పుతున్నదని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, పర్యావరణహిత దీపావళిని జరుపుకోవాలని బాణాసంచా వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాలని మరియు కాలుష్యాన్ని తగ్గించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. ఈ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం మరియుమరియు విద్యార్థులు విజయాలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీమరియు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు చాలా ఆలోచింపచేసాయి అదే విధంగా నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మిస్ మ్యాచింగ్ కు చాలా ప్రత్యేకత ఉన్నది. మిస్ మ్యాచింగ్ అంటే వివిధ రకాల కార్యక్రమాలను చేపట్టడం. ఒక కార్యక్రమానికి మరొక కార్యక్రమానికి బేధం ఉంటుంది. కార్యక్రమం అంతయు అత్యద్భుతం మిస్ మ్యాచింగ్ లో భాగంగా అనేక కార్యక్రమాలను చేసి చూపెట్టారు. మిస్ మ్యాచింగ్ లో భాగంగా ఒక వస్తువు మరొక వస్తువుకు భేదం మరియు ప్రత్యేకత ఉంటుందని. చాలా బేధాలను చూపెట్టారు. వివిధ కార్యక్రమాలు ఆనందం పెంపొందించాయి.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

రైతు అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రస్థాయి రైతు మేళా

తక్కువ నీటి వనరులతో అధిక దిగుబడులు సాధించడమే ప్రధాన ఉద్దేశం

ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన





నాగర్‌కర్నూల్ అక్షిత ప్రతినిధి: నాగర్ కర్నూల్ జిల్లా నుంచి 2,500 మంది రైతులు, రైతుల సౌకర్యార్థం 50 ప్రత్యేక బస్సులు.. ప్రతి బస్సుకు ప్రత్యేక నోడల్ అధికారి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడం, రైతుల ఆదాయాన్ని పెంపొందించడం, సాగులో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు పరిచయం చేయడం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్రస్థాయి రైతు మేళాను నిర్వహిస్తోందని,ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పరిస్థితులకు తక్కువ నీటి వనరులతో అధిక దిగుబడులు సాధించడం, సాగు ఖర్చులను తగ్గించుకోవడం, పంటల ఉత్పాదకతను పెంచుకోవడం, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు ఈ రైతు మేళా ప్రత్యేక వేదికగా నిలవనుందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు.

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేట గ్రామంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రైతు మేళాను ఈ నెల 7వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొనేలా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా నుంచి 2,500 మంది రైతులను ఎంపిక చేసి ఈ నెల 9వ తేదీన రైతు మేళాను రైతులు వీక్షించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు.

వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లను అధిగమించడంతో పాటు, రైతులకు నూతన సాగు విధానాలపై అవగాహన కల్పించడం ఈ రైతు మేళా ప్రధాన ఉద్దేశమని, నీటి వనరుల లభ్యతను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో పంటలు సాగు చేయడం, అధిక దిగుబడులు ఇచ్చే పంటల ఎంపిక, పంటల సాంద్రత పెంపు, శాస్త్రీయ సాగు పద్ధతుల అమలు, ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగం వంటి అంశాలపై రైతులకు వివరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

సంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో పాటు కాలానుగుణంగా అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయంలో నీటి వినియోగాన్ని తగ్గిస్తూ, భూసారాన్ని కాపాడుకుంటూ, పెట్టుబడి వ్యయాన్ని నియంత్రించి అధిక ఉత్పత్తి సాధించే విధానాలపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

రైతు మేళాలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ రంగ ప్రముఖులు పాల్గొని రైతులకు వివిధ అంశాలపై విలువైన సూచనలు, సలహాలు అందించనున్నారు. పంటల సాగులో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, నీటి యాజమాన్య పద్ధతులు, పంటల ఉత్పాదకత పెంపు, నేలసాంద్రత మట్టి నమూనా పరీక్షలు, ఆధునిక సాగు విధానాలు, వ్యవసాయ యాంత్రీకరణ ప్రాధాన్యత వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.

వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలు, పరిశోధనల ఫలితాలు, శాస్త్రీయ సాగు విధానాలను రైతులకు చేరువ చేయడం ద్వారా వ్యవసాయంలో గుణాత్మక మార్పులు తీసుకురావడానికి ఈ మేళా దోహదపడుతుందని, రైతులు తమకు ఎదురవుతున్న వ్యవసాయ సమస్యలను నిపుణుల దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కార మార్గాలను తెలుసుకోవాలని, శాస్త్రవేత్తలు అందించే సూచనలను తమ భూముల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అమలు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

నాగర్ కర్నూల్ జిల్లాలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం, రైతులకు ఆధునిక వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తి పెంపు, రైతుల ఆదాయాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ వెల్లడించారు.

రైతు మేళా ద్వారా పొందిన విజ్ఞానాన్ని తమ వ్యవసాయ క్షేత్రాల్లో అమలు చేస్తూ, ఆధునిక సాంకేతికతతో తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు సాధించి నాగర్ కర్నూల్ జిల్లాను వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు రైతులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

నాగర్ కర్నూల్ బస్టాండ్‌లో బాలింతల పాలిచ్చే కేంద్రాన్ని

ప్రారంభించిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి



నాగర్‌కర్నూల్ అక్షిత ప్రతినిధి: బాలింతలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా నాగర్ కర్నూల్ బస్టాండ్ నాగర్ కర్నూల్ ప్రభుత్వ జర్నల్ ఆసుపత్రి, నాగర్ కర్నూల్ కలెక్టరేట్ లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలింతలు తమ చిన్నారులకు సురక్షితమైన ప్రాంతంలో సౌకర్యవంతంగా తల్లులు తమ చిన్నారులకు తల్లిపాలు అందించే కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ప్రయాణ సమయంలో బాలింతలు తమ శిశువులకు ఇబ్బందులు లేకుండా తల్లిపాలు అందించేందుకు ప్రత్యేక సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి తెలిపారు.

జిల్లా కలెక్టరేట్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, బస్టాండ్‌కు నిత్యం వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో చిన్నపిల్లలతో ప్రయాణించే తల్లులు, ముఖ్యంగా బాలింతలు, తమ శిశువులకు తల్లిపాలు అందించేందుకు సరైన సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. ఈ సమస్యను గుర్తించిన జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు బస్టాండ్‌లో ప్రత్యేక పాలిచ్చే కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

ఈ కేంద్రం అందుబాటులోకి రావడంతో ప్రయాణ సమయంలో బాలింతలు తమ చిన్నారులకు ప్రశాంతమైన, సౌకర్యవంతమైన వాతావరణంలో తల్లిపాలు అందించేందుకు అవకాశం కలుగుతుంది. బహిరంగ ప్రదేశాల్లో బాలింతలు ఎదుర్కొనే అసౌకర్యాలను తగ్గించడంతో పాటు, తల్లులు మరియు శిశువుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక సదుపాయాన్ని కల్పించడం ద్వారా మహిళలకు మరింత భరోసా కల్పించనుంది.

తల్లిపాలు శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఎంతో ముఖ్యమైనవని, చిన్నారులకు తల్లిపాలు అందించేందుకు అనుకూలమైన వాతావరణం కల్పించడం అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజా రవాణా కేంద్రాల్లో మహిళలు, చిన్నారులకు అవసరమైన సౌకర్యాలను కల్పించడం ద్వారా వారి ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు ఇటువంటి ఏర్పాట్లు దోహదపడతాయని తెలిపారు.

జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం బాలింతలకు ఉపయోగకరంగా ఉంటుందని, కలెక్టరేట్, ఆస్పత్రి, బస్టాండ్‌కు వచ్చే మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర , జిల్లా రెవెన్యూ అధికారి ఇన్చార్జి సంక్షేమ శాఖ అధికారి పాండు, ఆర్టీసీ డిఎం యాదగిరి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియ, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మందమర్రి గురుకుల విద్యార్థిని



మందమర్రి, అక్షిత ప్రతినిధి: మంచిర్యాల జిల్లా రెబ్బనపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈ నెల 7న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 బాలబాలికల వాలీబాల్ పోటీల్లో మందమర్రి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని సీహెచ్. హిమబిందు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. మంచిర్యాల జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన హిమబిందు తన క్రీడా నైపుణ్యంతో ఆకట్టుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొననుంది. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. హిమబిందు విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పాఠశాల పీడీ సోనియా, పీఈటీ మల్లికతో పాటు వైస్ ప్రిన్సిపాల్ స్వరూపరాణి, శివప్రియ, ఉపాధ్యాయ బృందం హిమబిందును అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ఆసుపత్రిలో మంగళి చంద్రయ్యను పరామర్శించిన శుభ ప్రద్ పటేల్

త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష.. కుటుంబ సభ్యులకు భరోసా..



తాండూరు అక్షిత ప్రతినిధి: బషీరాబాద్ మండలం రెడ్డి ఘనాపూర్ గ్రామానికి చెందిన మంగళి చంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతూ, వికారాబాద్‌లోని మిషన్ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీసీ కమిషన్ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శుభ ప్రద్ పటేల్ శనివారం ఆసుపత్రిని సందర్శించి చంద్రయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు.

ఈ సందర్భంగా చంద్రయ్యను పరామర్శించి, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకో వాలని, ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యుల తో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. చంద్రయ్యకు అందుతున్న వైద్య సేవల గురించి ఆసుపత్రి వైద్యులతో చర్చించి, మెరుగైన చికిత్స అందించాలని, సూచించారు.

కష్టకాలంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అండగా నిలవడంతో పాటు, వారి కుటుంబాలకు ధైర్యం కల్పించడం ఎంతో ముఖ్యమని శుభ ప్రద్ పటేల్ పేర్కొన్నారు. బాధితులకు అవసరమైన సమయంలో మనోధైర్యం కల్పించడం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని, శుభ ప్రద్ పటేల్ అన్నారు.

జానకి నగర్‌లో వైభవంగా శ్రీ కాళికాదేవి అమ్మవారి జాతర మహోత్సవాలు

మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు,హోమాలు.

పెద్ద సంఖ్యలో పాల్గొననున్న భక్తులు



కోదాడ అక్షిత ప్రతినిధి: దీపావళి పండుగను పురస్కరించుకొని చిలుకూరు మండలం జానకి నగర్ గ్రామంలోని శ్రీ కాళికాదేవి అమ్మవారి దేవాలయం వద్ద మూడు రోజుల పాటు అమ్మవారి జాతర మహోత్సవాలను అంగరంగ వైభవంగా దేవాలయ కమిటీ సభ్యులు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించడంతో పాటు భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనమైన ఏర్పాట్లు చేస్తున్నారు. దాతల సహకారంతో ఈ జాతర మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.ఈ పవిత్ర జాతర మహోత్సవాలకు గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని దేవాలయ కమిటీ సభ్యులు కోరారు. శ్రీ కాళికాదేవి అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అదేవిధంగా దేవాలయ అర్చకులు దేవ కృష్ణ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు: దేవాలయ అధ్యక్షులు బట్టు వెంకటేశ్వర్లు, ముఖ్య సలహాదారులు బట్టు శ్రీనివాస్, బట్టు రమణ, బట్టు రమేష్, బట్టు కరంచంద్, రత్నావత్ తిరుమల, కోశాధికారి దుంగ్రోత్ లాలు, ప్రధాన కార్యదర్శులు బట్టు అభిషేక్, బట్టు కేవల్ పంతు, సహాయ కార్యదర్శి బట్టు సక్రు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



కాజీపేట్, అక్షిత ప్రతినిధి : జాతీయ పుస్తక వారోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండలోని అశోక కాంప్లెక్స్‌లో ఉన్న నవచేతన బుక్ హౌస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ కావ్య మీడియాతో మాట్లాడుతూ.. పుస్తకం మనిషికి మంచి నేస్తమని, జీవితాంతం జ్ఞానాన్ని అందించే గొప్ప సంపద అని అన్నారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెంపొందడంతో పాటు సమాజం పట్ల అవగాహన, జీవితాన్ని చూసే దృక్పథం మెరుగుపడుతాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా నవచేతన బుక్ హౌస్ నిర్వాహకులను అభినందిస్తూ, పుస్తక పఠన సంస్కృతిని ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

అనంతరం పుస్తక ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను ఎంపీ డాక్టర్ కడియం కావ్య సందర్శించి, పలు రకాల పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించి, నచ్చిన పలు పుస్తకాలను స్వయంగా కొనుగోలు చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, సీనియర్ జర్నలిస్టులు, గడ్డం కేశవమూర్తి, గడ్డం రాజిరెడ్డి, వల్లాల వెంకటరమణ, వేణుమాధవ్, తోట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరపాలి

మంత్రి పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం, ఒక శాఖ నుంచి మరో శాఖకు పంపిస్తూ దాటవేత ధోరణి అవలంబించడం సహించేది లేదని హెచ్చరించారు.

కొల్లాపూర్ నియోజకవర్గంలోని కోదేరు మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తో కలిసి, మంత్రి జూపల్లి కృష్ణారావు మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా వినతుల పరిష్కారంలో వివిధ శాఖల పనితీరును సమీక్షించారు.

ఈ సందర్భంగా ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించకుండా, సరైన విచారణ జరపకుండా పరిష్కరించినట్లు చూపించడం లేదా పరిష్కారంలో జాప్యం చేయడంపై మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్, కోదేరు తహసీల్దార్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఎందుకు వస్తోందని అధికారులను ప్రశ్నించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, అధికారులు కేవలం అర్జీలు స్వీకరించి రికార్డుల్లో నమోదు చేయడంతో తమ బాధ్యత ముగిసినట్లు భావించరాదని అన్నారు. ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించి, అర్హులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

కోదేరు మండలంలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 395 ప్రజా వినతులు అందినట్లు సమీక్షలో వెల్లడైంది. శాఖల వారీగా పరిశీలిస్తే రెవెన్యూ శాఖకు 62, వ్యవసాయ శాఖకు 4, ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్‌కు 22, విద్యాశాఖకు 4, డీఆర్‌డీఓకు 14, దేవాదాయ శాఖకు 11, మహిళా శిశు సంక్షేమ శాఖకు 5, గృహ నిర్మాణ శాఖకు 21, నీటిపారుదల శాఖకు 29, పంచాయతీరాజ్ శాఖకు 116, విద్యుత్ శాఖకు 14, ఆర్టీసీకి 8, ఇతర శాఖలకు 85 వినతులు అందాయి.

వీటిలో 210 వినతులు ఇంకా విచారణ, పరిష్కార దశలో ఉన్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో 25, పంచాయతీరాజ్ శాఖలో 73, ఇతర శాఖల్లో 45 వినతులు పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడైంది.

ప్రజల నుంచి వచ్చిన వినతులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని, ముఖ్యంగా భూ సమస్యలు, తాగునీరు, రహదారులు, విద్యుత్, సాగునీరు, ఇళ్ల నిర్మాణం వంటి మౌలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు.

ప్రజా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తోందని, అదే బాధ్యత అధికార యంత్రాంగంలోనూ కనిపించాలని మంత్రి అన్నారు. ప్రతి వినతికి సంబంధించి తీసుకున్న చర్యలు, పరిష్కారానికి పట్టే సమయం, పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని, అవసరమైతే సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలకు



పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులు లేకుండా అధికారులు చొరవ తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారుల పనితీరును సమీక్షిస్తామని మంత్రి తెలిపారు.

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ....., ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ అధికారులు జవాబుదారితనంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడంతో పాటు, వారి అవసరాలను గుర్తించి సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ప్రజలు తమకు ఎదురయ్యే భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, ఇతర ప్రభుత్వ సేవలకు సంబంధించిన సమస్యలను రాతపూర్వకంగా సంబంధిత అధికారులకు అందజేయాలని కలెక్టర్ కోరారు. ప్రజలు సమర్పించిన వినతులపై అధికారులు స్పందించకపోయినా, సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగినా, సంబంధిత అధికారులు పట్టించుకోకపోయినా తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అనంతరం "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి పండుగ" అనే రూపొందించిన పోస్టర్‌ను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్‌లు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ప్రాధాన్యతను గుర్తించాలని వారు ఈ సందర్భంగా సూచించారు.

ఎయిర్‌టెల్ ఆఫర్ పేరుతో సైబర్ మోసం!

రూ.2 వేల ఉచిత నగదు ఆశ చూపి ప్రజలకు వల

నకిలీ లింక్‌లతో బ్యాంకు ఖాతాల వివరాల చోరీకి యత్నం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

లోకేశ్వరం ఎస్సై ఎల్. ప్రదీప్ హెచ్చరిక...

లోకేశ్వరం, నవంబర్ 7, అక్షిత న్యూస్: నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పండుగ ఆఫర్ల పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసేందుకు కొత్త ఎత్తుగడలకు పాల్పడుతున్నారు. ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ పేరును ఉపయోగించుకుంటూ దీపావళి ప్రత్యేక ఆఫర్ కింద రూ.2 వేల ఉచిత నగదు అందిస్తామంటూ నకిలీ సందేశాలు పంపిస్తున్నారు. వాట్సాప్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాల్లో అనుమానాస్పద లింక్‌లను ప్రచారం చేస్తూ ప్రజల వ్యక్తిగత, బ్యాంకు ఖాతాల వివరాలను



కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ తరహా మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్వరం ఎస్సై ఎల్. ప్రదీప్ హెచ్చరించారు.

ఉచిత నగదు వస్తుందన్న ఆశతో గుర్తుతెలియని లింక్‌లను క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాల్లోని నగదును కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. నకిలీ లింక్‌ల ద్వారా వ్యక్తిగత వివరాలను నమోదు చేయించుకుని ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లను సేకరించి నగదు దోచుకునే అవకాశం ఉందని వివరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉచిత నగదు, బహుమతులు, ప్రత్యేక ఆఫర్ల పేరుతో వచ్చే సందేశాలను నమ్మవద్దని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదని స్పష్టం చేశారు. ఏ సంస్థకు సంబంధించిన ఆఫర్ అయినా ఆ సంస్థ అధికారిక వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌లో మాత్రమే నిర్ధారించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు.

సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి

ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్సై ఎల్. ప్రదీప్ కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు...

సమాజం బాగుండాలంటే విద్య ఒక్కటే మార్గం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ ఉంది

ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



చేతుల మీదుగా నగదు ప్రోత్సాహక చెక్కుల ప్రదానోత్సవం

మహబూబ్ నగర్,అక్షిత న్యూస్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందని, వారికి సరైన ప్రోత్సాహం, నాణ్యమైన శిక్షణ, అవసరమైన సౌకర్యాలు కల్పిస్తే అద్భుతమైన ఫలితాలు సాధిస్తారని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శ్రీరామ్ గ్రూప్ ఆధ్వర్యంలో "చదువుకో తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా 2025-36 విద్యా సం.లో పదవతరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు యెన్నం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. అంతకుముందు ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడం ప్రభుత్వంతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. 'మహబూబ్‌నగర్ ఫస్ట్' ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని, వారు ఉత్తమ ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందని తెలిపారు. గతంలో విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి ప్రత్యేక శిక్షణ, పుస్తకాలు, సమయపాలన, మార్గదర్శనం అందించడం వల్లే ఈ మార్పు సాధ్యమైందన్నారు. విద్యార్థులు కష్టపడేలా ప్రోత్సహించడం, వారి ప్రతిభను వెలికితీయడం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, సమాజం బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా వాలంటీర్లు, ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ఎంతో కీలకమని ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు కూడా ముందుకు వచ్చి సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో విద్యారంగంలో గొప్ప మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు. విద్యా వాలంటీర్ల వ్యవస్థకు శ్రీరామ్ గ్రూప్ వంటి సంస్థలు సహకారం అందిస్తే మరింత మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను చేరువ చేయవచ్చని అన్నారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా ఉన్నత విద్య, పరిశోధన, వ్యాపార రంగాలు, పరిశ్రమల స్థాపన వంటి విభిన్న రంగాల్లో రాణించేలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో ప్రతిభ చాటేలా అందరం కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం శ్రీరామ్ గ్రూప్ అందిస్తున్న సహకారం అభినందనీయమని, ఇలాంటి సామాజిక బాధ్యత కార్యక్రమాలు మరిన్ని సంస్థలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. విమర్శలను పట్టించుకోకుండా విద్యార్థుల అభ్యున్నతి, సమాజ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు. ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ 2023 నుంచి తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉచిత విద్యుత్, పారిశుధ్య నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపట్టింది. అదే స్ఫూర్తితో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే విద్యారంగంలో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణతో పాటు, ఈ ఏడాది ప్రాథమిక పాఠశాలలకూ వాలంటీర్లను ఏర్పాటు చేసి విద్యార్థుల సంఖ్య, విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ ప్రయత్నాల ఫలితంగా విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించడం, పాఠశాలలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరగడం ఎంతో అభినందనీయం. రాబోయే రోజుల్లో రాష్ట్రస్థాయి ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆకాంక్షిస్తున్నామని, విద్యాభివృద్ధి కోసం ఎమ్మెల్యే చేస్తున్న కృషి మరెన్నో విజయాలకు బాటలు వేయాలని ఆయన కోరుకుంటున్నాను. శ్రీరామ్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ తరఫున విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరించడం ఎంతో ఆనందంగా ఉంది. సుమారు 50 ఏళ్లుగా ఆర్థిక సేవల రంగంలో కొనసాగుతున్న మా సంస్థ, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తోంది. విద్యతో పాటు శారీరక ఆరోగ్యం, మానసిక దృఢత్వం కూడా ఎంతో ముఖ్యం. విద్యార్థులు పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో కృషి చేయాలి. మన జీవితమే ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలి. మహాత్మా గాంధీ వంటి మహనీయుల జీవితాల నుంచి ప్రేరణ పొంది, ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలి. విద్యార్థుల కోసం ఇంత గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారికి, ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు. అనంతరం జిల్లా టాపర్ ఆరాధ్య (జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల, పెద్ద ఆదిరాల) కు ₹2 లక్షల రూపాయల విలువైన చెక్కును, అలాగే దేవరకద్ర నియోజకవర్గ టాపర్ నిశిత మహబూబ్ నగర్ నియోజకవర్గం టాపర్ సాన్వీ (బేసిక్ ప్రాక్టీస్ హైస్కూల్) లకు చెరో లక్ష రూపాయలు చెక్కును ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. వివిధ మండలాల టాపర్లకు ₹10,000 చొప్పున ఒక్కో విద్యార్థికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, శ్రీరాం గ్రూప్ ఫైనాన్స్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి , ఎజిఎం సతీష్, ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మైత్రి యాదయ్య, సోషల్ మీడియా కన్వీనర్ ఏర్పుల నాగరాజు, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ సమన్వయ కర్త రవీందర్ రెడ్డి, తాటికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలు యాదవ్ మరియు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవితాల్లో దీపావళి కొత్త వెలుగులు నింపాలి

దీపావళిని ఆనందోత్సాహాలతో, సురక్షితంగా జరుపుకోవాలి

ప్రతి ఇంటా సిరిసంపదలు వెల్లివిరియాలి

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



నాగర్‌కర్నూల్ అక్షిత ప్రతినిధి: చెడుపై మంచి, దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి అని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు.

శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి ఎప్పుడూ విజయం సాధిస్తుందని, ప్రతి ఒక్కరూ ఇతరులకు మేలు చేసే ఆలోచనతో ముందుకు సాగాలని సూచించారు. ప్రజలందరి జీవితాల్లో కష్టాల కారుచీకట్లు తొలగిపోయి, చిరుదివ్వెల వెలుగుల వలే అనునిత్యం సుఖ సంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఎంతో ఉత్సాహంగా నిర్వహించుకునే దీపావళి పండుగను ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకోవాలని అభిలషించారు.

ఏ కాలంలోనైనా, ఎప్పటికైనా చెడుకు తావు ఉండదని, మంచి చేసే వారికి దైవ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందోత్సాహాలను నింపాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

అదేవిధంగా ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటిస్తూ, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా దీపావళి వేడుకలు నిర్వహించుకోవాలని జిల్లా ప్రజలకు సూచించారు.

ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ప్రతి ఇంటా సిరిసంపదలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని, కోటి ఆనంద దీపాలు వెలగాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆకాంక్షించారు.

వధువు సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



కరీంనగర్ అక్షిత బ్యూరో : విత్ యూ ఫీడ్ దెమ్ మరియు క్రిస్టోఫర్ ఫౌండేషన్ సహకారంతో వధువు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10 వ తేదీ సోమవారం నాడు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బిషప్ ప్రదీప్ కుమార్ మరియు వారి కుటుంబం సభ్యులు తెలిపారు. నగరంలోని విద్యారణ్యపురి రోడ్ నెంబర్ 1 లో ఉన్న వధువు సంఘం చర్చి ప్రాంగణంలో నవంబర్ 10 వ తేదీ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు కంటి వైద్య పరీక్ష, రక్తపోటు పరీక్ష (బీపీ), ఈసిజీ పరీక్ష, మధుమేహం పరీక్ష, రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన మందులు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.వైద్య శిబిరం సమాచారం కోసం 9676864535, 9885500032 లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రమాదరహితంగా దీపావళి జరుపుకోవాలి

మండల ప్రజలకు ఎస్సై శ్రావణ్ కుమార్ దీపావళి శుభాకాంక్షలు..

నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై కఠిన చర్యలు



నర్సంపేట అక్షిత ప్రతినిధి : చెడుపై మంచి, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగను ప్రజలంతా ప్రమాదరహితంగా, సురక్షితంగా జరుపుకోవాలని నెక్కొండ ఎస్సై శ్రావణ్ కుమార్ ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా మండల ప్రజలకు ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ ముందస్తు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. బాణసంచా కాల్చే సమయంలో చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చేలా చూడాలని, ప్రమాదాల నివారణకు పట్టు, వదులుగా ఉండే వస్త్రాలు కాకుండా మందపాటి నూలు బట్టలు మాత్రమే ధరించాలని కోరారు. చేతిలో పట్టుకుని కాకుండా పొడవైన వత్తుల సాయంతో తగినంత దూరం నుంచి టపాసులు వెలిగించాలని, గుడిసెలు, ఇరుకైన వీధులు, విద్యుత్ తీగలు, గడ్డివాములకు దూరంగా మైదానాల్లో మాత్రమే బాణసంచా కాల్చడంతో పాటు ఆకాశంలోకి వెళ్లే రాకెట్లను ఖాళీ ప్రదేశాల వైపు మళ్లించాలని స్పష్టం చేశారు. వెలిగించిన టపాసు పేలకపోతే వెంటనే దాని దగ్గరకు వెళ్లకూడదని, ముందు జాగ్రత్తగా ఇంటి ఆవరణలో నీళ్లు, ఇసుక అందుబాటులో ఉంచుకుని ఒకవేళ కాలిన గాయాలైతే వెంటనే చల్లటి నీరు పోయాలి తప్ప సిరా, పసుపు లాంటివి రాయకూడదని, వృద్ధులు, పసిపిల్లలు, రోగులకు ఇబ్బంది కలగకుండా శబ్ద కాలుష్యం లేని పండుగ జరుపుకోవాలని సూచించారు.

బాణసంచా విక్రయించే వ్యాపారులు పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, జనావాసాలకు దూరంగా అధికారులు సూచించిన బహిరంగ ప్రదేశాల్లో రెండు దుకాణాల మధ్య తగినంత దూరం ఉండేలా తాటాకులు, గడ్డి వాడకుండా రేకులతో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై ఆదేశించారు. ప్రతి దుకాణం వద్ద అగ్నిమాపక పరికరాలు, నీళ్లు, ఇసుక అందుబాటులో ఉంచుకుని నాణ్యమైన విద్యుత్ వైరింగ్ వాడాలని, దుకాణాల పరిసరాల్లో ధూమపానం, వంటలు చేయడం, రాత్రి బస చేయడం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. ఏవైనా ప్రమాదాలు జరిగితే వెంటనే 100, 101, 108 నంబర్లకు సమాచారం అందించాలని, నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారుల అనుమతులు రద్దు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రావణ్ కుమార్ హెచ్చరించారు.

స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో గ్రీన్ దీపావళి వేడుకలు

పర్యావరణ సహిత దీపావళి కోసం స్మార్ట్ కిడ్జ్ చిన్నారుల ప్రయత్నం



ఖమ్మం /అక్షిత బ్యూరో : ఖమ్మం నగరం స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం కాలుష్య రహితంగా పర్యావరణహితంగా గ్రీన్ దీపావళి వేడుకలను సంబరంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణమంతా రంగురంగుల ముగ్గులతో పూల ముగ్గులతో తీర్చిదిద్దారు. అనంతరం లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నూనె ప్రమిదలను వెలిగించి దీపావళి వేడుకలను విద్యార్థులు ఉత్సాహంగా జరిపారు. గ్రీన్ దీపావళి సందేశాన్ని చెబుతూ స్మార్ట్ కిడ్జ్ పాఠశాల చిన్నారులు నిర్వహించిన దీపావళి సంబరాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ దీపావళి వేడుకలను పర్యావరణహితంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. చెడుపై మంచి విజయం సాధించిన ప్రతీకగా పురాణాల కాలం నుంచి దీపావళి సంబరాలు జరుపుకుంటున్నామన్నారు. దీపావళి వెలుగుల ప్రస్థానాన్ని భవిష్యత్తులోనూ కొనసాగించాలని తెలిపారు. కాలుష్యాన్ని కలగజేయకుండా పర్యావరణాన్ని రక్షించుకునే విధంగా దీపావళి వేడుకలను జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ గ్రోవ్ స్కూల్స్‌లో ఘనంగా దీపావళి వేడుకలు



చౌటుప్పల్/ అక్షిత న్యూస్: దీపావళి పండుగను పురస్కరించుకొని ఒకరోజు ముందుగానే దీపావళి వేడుకలను పట్టణ కేంద్రంలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణాన్ని అందమైన దీపాలంకరణలు, రంగురంగుల అలంకరణలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యార్థుల సృజనాత్మకత, ఉత్సాహం, సంప్రదాయ కళాత్మకతతో పాఠశాల ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకుంది. ఈ వేడుకలను తిలకించిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇంతటి అద్భుతమైన కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించిన ఉపాధ్యాయ బృందాన్ని పాఠశాల చైర్మన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి, డైరెక్టర్ సాదిపల్లి లక్ష్మీ ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ... విద్యార్థుల జీవితాల్లో దీపావళి దీపాల్లా జ్ఞానజ్యోతులు వెలుగుతూ, విద్యారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు, దేశానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

విద్యార్థులందరికీ, వారి తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయ బృందానికి గ్రీన్ గ్రోవ్ స్కూల్స్ యాజమాన్యం హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేసారు.

సొంత 'ఇందిరమ్మ' ఇంట్లో తొలి దీపావళి వెలుగులు

కలల సౌధాల్లో గృహప్రవేశాలు, లబ్ధిదారుల ఇంట అంబరాన్నంటిన సంబురాలు

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కృషితో నెరవేరిన నిరుపేదల సొంతింటి కల

నేడు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం, శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి



నర్సంపేట అక్షిత ప్రతినిధి : మాకంటూ ఓ సొంతిల్లు ఉంటే ఎంత బాగుండు అని జీవితకాలం కలలుగన్న నిరుపేదల ఆశలు కాంగ్రెస్ ప్రభుత్వ 'ప్రజాపాలన'లో సాకారమయ్యాయి. ఇన్నాళ్లూ అద్దె ఇళ్లలో, పూరి గుడిసెల్లో పండుగలు జరుపుకున్న నిరుపేదలు తొలిసారిగా తాము నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తి చేసుకుని నేడు దీపావళి పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లలో తమ సొంత గడపపై సగర్వంగా దీపాలు వెలిగించుకుంటుండటంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

పేదలకు సొంత గూడు కల్పించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దార్శనికతతో, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లలో లబ్ధిదారులు ఇప్పటికే ఆనందోత్సాహాల మధ్య గృహప్రవేశాలు చేశారు. తమ సొంతింట్లో తొలిసారి పండుగ జరుపుకుంటున్న లబ్ధిదారులు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ఈ దీపాలు కేవలం ప్రమిదల్లో వెలిగేవి కావు, మా తలరాతను మార్చిన ఆనందపు వెలుగులు అని భావోద్వేగంతో చెబుతూ సీఎంకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

నిరుపేదలు సొంతింటి యజమానులుగా మారి తొలి దీపావళి జరుపుకుంటున్న సంతోషకరమైన తరుణంలో టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ నర్సంపేట నియోజకవర్గ ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదే సమయంలో నేడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తూ, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న గొప్ప దార్శనికుడు, పేదల పక్షపాతి అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆ భగవంతుడు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆయన ప్రార్థించారు. వారి నాయకత్వంలో రాష్ట్రం మరింత సుభిక్షంగా వర్ధిల్లాలని రంజిత్ రెడ్డి ఆకాంక్షించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆధ్వర్యంలో ఎవ్వరికీ అన్యాయం జరగకుండా నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందుతున్నాయని, ఈ పండుగ ప్రజలందరికీ అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని ఆయన కోరుకున్నారు.

వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలి:

మార్తినేని ధర్మారావు



కాజీపేట్, అక్షిత ప్రతినిధి : హనుమకొండ జిల్లా తాళ్ల పద్మావతి కళాశాలలో బీజేవైఎం హనుమకొండ జిల్లా అధ్యక్షులు పున్నం వేణు ఆధ్వర్యంలో 'యువ సంవాద్ -- వికసిత్ భారత్ 2047' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ కౌన్సిల్ సభ్యులు, మాజీ శాసనసభ్యులు మార్తినేని ధర్మారావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పంలో యువత భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడటమే కాకుండా, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, స్టార్టప్‌లు, సామాజిక సేవ వంటి రంగాల్లో రాణిస్తూ దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ప్రతి యువకుడు బాధ్యతతో, నూతన ఆలోచనలతో ముందుకు సాగినప్పుడే వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో 62వ డివిజన్ అధ్యక్షులు మేకల శ్రావణ్ యాదవ్, ఇంచార్జ్ నిఖిల్ రావు, బీజేవైఎం ఉపాధ్యక్షులు మద్దెల కార్తీక్, నల్లరపు శివ, కార్యదర్శులు భరత్, శశి, ఉదయ్, ప్రవీణ్, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు

మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది



సూర్యాపేట , అక్షిత బ్యూరో : పట్టణ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా,పార్టీలకతీతంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది అన్నారు.పట్టణంలోని ప్రతి వార్డును సమానంగా అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు.శనివారం పట్టణంలోని 7వ వార్డులో రూ.5 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, మురుగునీటి సమస్యల పరిష్కారం,డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.ప్రజలకు మెరుగైన జీవన సౌకర్యాలు కల్పించాలంటే మౌలిక వసతుల అభివృద్ధి ఎంతో అవసరమని అన్నారు.వర్షాకాలంలో మురుగునీరు నిల్వ ఉండకుండా,ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు.వార్డుల వారీగా సమస్యలను గుర్తించి అందుబాటులో ఉన్న నిధులతో అభివృద్ధి పనులను చేపడుతున్నామని వివరించారు.రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులందరి సహకారంతో పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా,7వ వార్డు కౌన్సిలర్ ఈద ప్రవీణ్,ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల గోపాల్,వార్డు నాయకులు విష్ణు స్వరూప్,దైద రవి,చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.